ఉత్తరం.. ఓ మధుర జ్ఞాపకం

- కనుమరుగైన కబురుల లేఖలు
- స్మార్ట్ ఫోన్ రాకతో ఉనికి కోల్పోయిన జాబులు
- బంధుమిత్రులకు ఉత్తరాలు రాసే ఊసే లేదు



ఆలూరులోని పోస్టాఫీస్



ఉత్తరాలు లేక వెలవెలబోతున్న పోస్టు బాక్సు

ఆలూరు రూరల్: ఉత్తరం ఒక మధురమైన జ్ఞాపకాలకు సాధనం. ఉత్తరాలు మన ఆత్మీయుల యోగక్షేమాలకు ఆనవాళ్లు.. ప్రేమికుల్లో విరబూసిన పారిజాతాలు.. సరిహద్దులో శత్రువులతో పగలు రాత్రి పోరాడుతున్న సైనికుడు తన భార్య పంపే హృదయ నివేదనల కోసం ఎదురు చూసేందుకు ఎన్నో పడిగాపులు.. ఇలా మానవ సంబంధాలకు నిలయంగా మారిన ఉత్తరాలు ఇప్పుడు కనుమరుగయ్యాయి. సెల్‌ఫోన్లు, ఎస్‌ఎంఎస్‌లు, వాట్సాప్‌లు, ఈ–మెయిల్ లాంటి అధునాతన టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో లేఖలు కనిపించకుండా పోయాయి.

వారంలో ఒకసారైన కబురు లేఖలు

గతంలో బంధువులు, మిత్రులు, ఆప్తులు, తమ వారితో కష్టసుఖాలను పంచుకునేందుకు మనసారా లేఖల ద్వారా వారంలో ఒకసారైనా సమాచారం చేరవేసుకునే వారు. కనీసం 15 రోజులలో ఆత్మీయులు, ఆప్తులతో ఉత్తరం రాకపోతే పోస్టాఫీసుకు వెళ్లి ఉత్తరం రాసి పోస్టుబాక్సులో వేసేవారు. కాగా ఆ ఉత్తరాలు మధురానుభూతులు, తీపి జ్ఞాపకాలు నేడు కనుమరుగయ్యాయి. స్మార్ట్ ఫోన్లు, ఈ–మెయిల్‌తో ఇవి ప్రస్తుతం కనిపించకుండా పోయాయి.

కలం స్నేహానికి చాలా క్రేజ్

ఎవరు ఎక్కడ ఉంటారో తెలియదు. వారపత్రికలు, మాసపత్రికల ద్వారా పరిచయం అయ్యేవారు. ఆ తరువాత కలం స్నేహంపై ఆసక్తి ఉన్నవారు వారి చిరునామా పత్రికల్లో ప్రచురించేవారు. అలా అభిరుచి ఉన్న వారు ఉత్తరాలు అందుకునేవారు. కలం స్నేహం అంటే ఒకప్పుడు బాగా క్రేజ్ ఉండేది. పేజీలకు పేజీలు ఉత్తరాలు రాసుకునే వారు.. ఇదంతా గతం.

పూజ్యులైన అమ్మానాన్నలకు...

ఇప్పుడు సెల్‌ఫోన్లు వచ్చాయి. వాట్సాప్ మెసేజ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒకప్పుడు ఇలా కాదు. పై చదువుల కోసం, ఉద్యోగం దూర ప్రాంతాలకు వెళ్లే పిల్లలు, యువకులు ఉత్తరాలు రాస్తే తప్పా యోగక్షేమాలు తెలిసేవి కాదు. అలాగే తల్లిదండ్రులు తమ సమాచారాన్ని పిల్లలకు తెలియజేయాలంటే ఉత్తరమే వారధిగా ఉండేది. పూజ్యులైన అమ్మానాన్నల పాదపద్మములను నమస్కరించి అంటూ... దూర ప్రాంతాల నుంచి కొడుకు, అత్తారింటి నుంచి కూతురు రాసే ఉత్తరాలు చూసుకుని తల్లిదండ్రులు పులకించి పోయేవారు. ఇలా మానవ సంబంధాలకు వారధిగా ఉండే ఉత్తరాలు నేడు కనుమరుగయ్యాయి. వాటి స్థానంలో అధునిక సమాచార మాధ్యమాలు అల్లుకున్నాయి. ఒకప్పటి ఉత్తరం ఇప్పుడు కొత్త హంగులు సంతరించుకుంది. ఒకప్పుడు బంధాలకు ఆప్యాయతలు పంచిన లేఖలు ఇప్పుడు కార్పొరేట్ సంస్థలకు వినియోగదారుల మధ్య వారధిగా సరికొత్త అవతారం ఎత్తాయి. సెల్‌ఫోన్లు, ఈ–మెయిల్, ఇంటర్నెట్, టెలిఫోన్లు, చాటింగ్ తదితర సేవలు విస్తరించాయి. పోస్టుకార్డుల స్థానంలో ఈ–పోస్టు, స్పీడ్ పోస్టులు అందుబాటులోకి వచ్చాయి. ఎక్స్‌ప్రెస్ పార్సిల్, ఎలక్ట్రానిక్ మిషన్ ఉత్తరాలు, బిజినెస్ పోస్టు, పేమెంట్ బ్యాంకులుగా పోస్టాఫీసులు పలు సేవలు అందిస్తున్నాయి.

ప్రధాన సమాచార వారధిగా...

ఆలూరులో గత 10 దశాబ్దాల నుంచి పోస్టాఫీసు ఉంది. ఇప్పటికీ ఇది నియోజకవర్గ ప్రధాన కార్యాలయంగా సేవలు అందిస్తుంది. గతంలో ప్రతిరోజూ వేలాది ఉత్తరాలు ఇక్కడ నుంచి ప్రజలకు చేరవేసేవి. టెక్నాలజీ కాలంలో ఉత్తరం బందీగా మారిపోయింది. ఆత్మీయులు రాసే ఉత్తరాల స్థానంలో ప్రపంచాన్ని గుప్పెట్లో పెట్టుకున్న సెల్‌ఫోన్ రాజ్యమేలుతోంది. ఇది మానవ సంబంధాలను ఉంచుతుందో, తెంచుతుందో అర్థం కాని పరిస్థితి అని పలువురు వృద్ధులు, సీనియర్ సిటిజన్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తరాల కోసం ఎదురుచూసే వాళ్లం



మనలోని భావాల్ని, ఎదుటివారికి నేరుగా చెప్పలేని విషయాలు ఉత్తరాల ద్వారా చక్కగా వివరించవచ్చు. ఉత్తరం ఓ మధుర జ్ఞాపకం. తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు ఇలా ఎవరికి ఉత్తరం రాసినా అదొక తీపి గుర్తు. లేఖలు భాషపై పట్టు పెంచుతాయి. ఈ విషయాన్ని నేటి తరం యువత గుర్తించి మళ్లీ ఉత్తరాలు రాసే సంస్కృతిని అలవర్చుకోవాలి.

– మురళీమోహన్,
రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు, ఆలూరు

ఉద్యోగ జీవితంలో ఎన్నో మధురానుభూతులు



నేను 40 ఏళ్లు పోస్టుమ్యాన్‌గా ఉద్యోగం చేసి రిటైర్డ్ అయ్యాను. గతంలో రోజు 400 నుంచి 500 వరకు ఉత్తరాలు వచ్చేవి. అవి పంచడానికి నాకు రెండు నుంచి మూడు రోజులు పట్టేది. ప్రస్తుతం అవేమీ లేవు. ఉత్తరం కోసం గ్రామాల్లో ఆ ఎదురుచూపులు, ఆ మధురానుభూతులు వర్ణించలేనివి. ఉత్తరాల కోసం ఎదురుచూసే ఓ తల్లి, ఓ కోడలు, కూతురు, కుమారుడు నా సైకిల్ బెల్ శబ్దం వినపడగానే సంతోషంతో పులకించేవారు. నేను వెళ్లి పోస్ట్ అనగానే వారి కళ్లలోని ఆనందం వర్ణనాతీతం. ఇతర పట్టణాలకు పనికి వెళ్లిన కొడుకు పంపిన మనీఆర్డర్ తీసుకుంటున్నప్పుడు ఆ తల్లిదండ్రుల ఆనందం ఇంతా అంతా కాదు. ఆ ఆనందాల్ని, అనుభూతులను నేటి తరం కోల్పోయింది. నా ఉద్యోగ జీవితంలో అలాంటి మధురానుభూతులు ఎన్నో ఉన్నాయి

– వాసు,
రిటైర్డ్ పోస్టుమ్యాన్, ఆలూరు,

హాస్టల్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణగిరి: మండల పరిధిలోని ఎరుకలచెర్వు ఎస్సీ బాలుర వసతి గృహంలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశం కోసం అర్హత ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని వార్డెన్ నాగేశ్వరరెడ్డి సూచించారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. వసతి గృహంలో 100 సీట్లు ఉన్నాయన్నారు. ఇప్పటికే 60 మంది విద్యార్థులు న్నారని, మిగిలిన 40 సీట్లను ఎస్సీ విద్యార్థులతో భర్తీ చేయనున్నట్లు చెప్పారు. దరఖాస్తులు హాస్టల్‌లో లభిస్తాయని పేర్కొన్నారు.

18న ఎమ్మెల్యే అభ్యర్థులతో సమావేశం

ఆలూరు: సార్వత్రిక ఎన్నికల్లో ఆలూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసిన వివిధ రాజకీయ పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థులు ఈ నెల 18వ తేదీ కర్నూలులో కలెక్టర్ సృజత అధ్యక్షతన జరిగే సమావేశానికి హాజరుకావాలని ఆలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.రామునాయక్ తెలిపారు. ఎన్నికలకు చేసిన ఖర్చు వివరాలను తెలియాల్సి ఉంటుందన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

కృష్ణగిరి: ఖరీఫ్ సీజన్‌లో యాజమాన్య పద్ధతులతో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన పంటల సాగుపై రైతులకు మెలకువలు వివరించారు. వేరుశనగ, కంది, ఆముదం పంటల సాగులో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు అవలంభించాలన్నారు. మేలైన విత్తనం ఎంపిక, విత్తన శుద్ధి, సమగ్ర సస్యరక్షణ తదితర వాటి గురించి వివరించారు. అలాగే 2023 సంవత్సరానికి సంబంధించి పంట నష్ట పరిహారం బ్యాంక్ ఖాతాలకు జమ కాని వారి వివరాలను ఆన్‌లైన్‌లో సరి చేస్తున్నామన్నారు.

క్లుప్తంగా

గాయత్రీ మాతకు ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న గాయత్రీ దేవి

ఆస్పరి: రామతీర్థంలోని గాయత్రీ మాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి అభిషేకాలు చేశారు. ఆకుపూజ, కుంకుమార్చన చేశారు. నైవేద్యం సమర్పించి మంగళహారతులు ఇచ్చారు. స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆస్పరి సొసైటీకి ఇన్‌చార్జ్ సీఈఓ నియామకం



నరసింహుడు

ఆస్పరి: ఆస్పరి సొసైటీలో సీనియర్ క్లర్క్‌గా పనిచేస్తున్న నరసింహుడును ఇన్‌చార్జ్ సీఈఓగా నియమిస్తూ కేడీసీసీ బ్యాంకు డీసీఎం రామాంజనేయులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు శుక్రవారం ఆస్పరి సొసైటీ కార్యాలయంలో నరసింహుడు బాధ్యతలు తీసుకున్నారు. ఇంతకు ముందు సీఈఓగా ఉన్న అశోక్ ఈనెల 10వ తేదీ రాజీనామా చేశారు. రైతులకు అందుబాటులో ఉంటూ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని ఇన్‌చార్జ్ సీఈఓ తెలిపారు.

ప్రభుత్వాసుపత్రిలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కల్పన

పత్తికొండ రూరల్: రక్తదాన దినోత్సవం సందర్భంగా శుక్రవారం పత్తికొండలోని ప్రభుత్వ కమ్యూనిటీ క్లస్టర్ కేంద్రంలో ప్రభుత్వ వైద్యులు రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. 10 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కల్పన మాట్లాడుతూ.. రక్తదానం పట్ల ప్రజలు అపోహలు వీడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ వైద్యులు ఆదినాగేష్, ఇర్ఫాన్, సిబ్బంది దేవయ్య, భూషయ్య తదితరులు పాల్గొన్నారు.


30 నుంచి విజయేంద్రతీర్థుల ఆరాధనోత్సవాలు



విశేష అలంకరణలో రాఘవేంద్ర, విజయేంద్రతీర్థులు

హొళగుంద: స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో వెలసిన విజయేంద్రతీర్థుల 410వ ఆరాధన మహోత్సవాలు ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు సేవా ట్రస్ట్ సభ్యులు తెలిపారు. జూలై 1న పూర్వారాధన, 2వ తేదీ ఏకాదశి, 3న మధ్యారాధన, 4న ఉత్తరాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై ఫిర్యాదు



ఎంఈఓ తిమ్మారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

దేవనకొండ: మండలంలో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.శరత్‌కుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎంఈఓ–1 తిమ్మారెడ్డి, ఎంఈఓ–2 విజయనిర్మలకు వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు కాకుండా, యాజమాన్యాలే ఫీజులను నిర్ణయించి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి భాస్కర్, నాయకులు ఈశ్వర్, భరత్, సురేంద్ర, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం



తుగ్గలిలో మాట్లాడుతున్న ఏపీడీ పక్కీరప్ప

తుగ్గలి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో 600 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టనున్నట్లు డ్వామా క్లస్టర్ ఏపీడీ పక్కీరప్ప తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఏపీడీ మాట్లాడుతూ.. మండలంలో 600 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు చెప్పారు. ఐదెకరాల్లోపు మెట్ట భూములున్న రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. ఇప్పటికే 250 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి రైతుల నుంచి దరఖాస్తులు వచ్చాయన్నారు. త్వరితగతిన టార్గెట్ పూర్తిచేస్తే వెంటనే అనుమతులు వస్తాయని తెలిపారు. మామిడి, సపోట, దానిమ్మ, డ్రాగన్, చీని తదితర పండ్ల మొక్కల పెంపకానికి ఉపాధి హామీ పథకం కింద మూడేళ్ల పాటు అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నందున ఆసక్తి ఉన్న రైతులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. అనంతరం ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రత్నం పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. క్లస్టర్ టీఏ గంగన్న, ఎంటీసీ నారాయణ, ఈసీ పెంచలయ్య పాల్గొన్నారు.

మద్దికెర: ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్ల తోటలు సాగు చేసేందుకు అవకాశం వచ్చిందని ఆసక్తి గల రైతులు ముందుకు రావాలని ఏపీడీ పక్కీరప్ప సూచించారు. ఆయన శుక్రవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో రికార్డుల పరిశీలన అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలో వ్యవసాయ బోర్లు కలిగిఉండి ఐదెకరాల్లోపు పొలం కలిగిన రైతులు రాయితీలు పొందేందుకు అర్హులన్నారు. పండ్ల మొక్కలతో పాటు మూడేళ్లపాటు నిర్వహణ ఖర్చులు ఇవ్వడం జరుగుతుందన్నారు రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీఓ నర్సిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పరికి సాగునీరు అందించాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నారాయణ

ఆస్పరి: వేదావతి ప్రాజెక్టు నిర్మించి ఆస్పరి మండలానికి సాగు, తాగునీరు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కె.వి. నారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆస్పరిలోని సుందరయ్య భవనంలో ఆ పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలోని రైతులు వర్షాధారంపై ఆధారపడుతూ ఏటా ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్నారని అవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్‌లో 90 శాతం సబ్సిడీతో వేరుశనగ, కంది, సజ్జ, జొన్న విత్తనాలు అందించాలని కోరారు. మండలంలో నకిలీ పత్తి విత్తనాలు అమ్మే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు హనుమంతు, బాలకృష్ణ, రంగస్వామి, మల్లేష్, రామాంజనేయులు, రవి, ఇబ్రహీం, వీరేష్ పాల్గొన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న సీఐ మురళీమోహన్

పత్తికొండ రూరల్: బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ మురళీమోహన్ సూచించారు. శుక్రవారం పత్తికొండ పోలీసు స్టేషన్‌లో ముస్లిం మతపెద్దలు, బీజేపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోవధ చట్టరీత్యా నేరమన్నారు. ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి తరలించే క్రమంలో సరైన పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. శాంతిభద్రతల సమస్య తలెత్తేలా ప్రవర్తిస్తే అలాంటి వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మత ఘర్షణలు ఏర్పడేలే సోషల్‌మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. బీజేపీ నాయకులు పూనా మల్లికార్జున, దండి మల్లికార్జున, ఎస్.రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కొండెక్కిన కూరగాయల ధరలు

- పచ్చిమిర్చి, కాకరకాయ, బీరకాయ కిలో రూ.100పైనే
- సామాన్యుడు కొనడం కష్టమే



గోనెగండ్లలో కూరగాయల దుకాణం

గోనెగండ్ల: కూరగాయల ధరలు రోజురోజుకు మండిపోతున్నాయి. సాధారణంగా వేసవిలో టమాటాల ధర మాత్రమే పెరగడం చూస్తుంటాం. అయితే ప్రస్తుతం అన్ని రకాల కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో సామాన్య ప్రజలు వాటిని కొనలేని పరిస్థితిలో ఉన్నారు. రోజురోజుకూ ధరలు పెరిగిపోతుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కూరగాయల ధరలు పెరిగిపోవడంతో సామాన్యులకు భారంగా మారింది. వీటిని కొనలేం తినలేం అన్న పరిస్థితి నెలకొంది. రెండు వారాల క్రితానికి, నేటికి కూరగాయల ధరలు రెట్టింపు అయ్యాయని సామాన్యులు వాపోతున్నారు. రెండు వారాల క్రితం పచ్చిమిర్చి కిలో రూ.40 ఉండగా ప్రస్తుతం కిలో రూ.100కు పైగా చేరింది. కాకరకాయ కిలో రూ.30 ఉండగా ప్రస్తుతం కిలో రూ.100కు చేరింది. బీరకాయ కిలో రూ.40 నుంచి రూ.100కు చేరింది. అలాగే క్యాబేజీ కేజీ రూ.60, అలుగడ్డ కేజీ రూ.60, బెండకాయ కిలో రూ.60, వంకాయ కిలో రూ.40, టమాట కిలో రూ.40 పలుకుతున్నాయి. వేసవిలో కూరగాయల దిగుబడి తగినంతగా లేకపోవడంతో ప్రస్తుతం కొరత ఏర్పడింది. దీంతో వ్యాపారస్తులు అధిక ధరలు పెట్టి కూరగాయలను కొనుగోలు చేసి దుకాణాల వద్ద అధిక ధరకు విక్రయిస్తున్నారు.

లూజు విత్తనాలు కొనొద్దు

మద్దికెర: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు పాటించాలని దళారీలు, మధ్యవర్తులు అమ్మే లూజు విత్తనాలు కొని మోసపోవద్దని ఏఓ రవి సూచించారు. విత్తనాల కొనుగోలుపై పలు సూచనలు చేశారు. వ్యవసాయ శాఖ వారిచే అనుమతి పొందిన డీలర్స్ దగ్గర మాత్రమే విత్తనాలు కొనాలన్నారు. కొనుగోలు చేసిన ప్రతి విత్తన పాకెట్‌లకు తప్పకుండా రసీదు, బిల్లుతో పాటు విత్తన సంచుల లేబుల్స్‌ను పంటకాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. లూజు విత్తనాలు కొని పంట నష్టపోతే వారికి నష్టపరిహారం రాదన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు.

సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకోవాలి

దేవనకొండ: దేవనకొండ సహకార సంఘంలో సభ్యత్వం, రుణం కలిగిన రైతులు తమ సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకోవాలని సీఈఓ ఎస్.రహంతుల్లా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందు కోసం పాసుపుస్తకం, ఆధార్, పాన్‌కార్డు జిరాక్స్, రెండు ఫొటోలను తీసుకుని సంఘం కార్యాలయంలో అందించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తుగ్గలి: మండల పరిధిలోని పెండేకల్లు, రామలింగాయపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు త్రీఫేజ్ విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ మండల ఏఈ మహేశ్వరరెడ్డి తెలిపారు. నునుసరాల్ల సమీపంలోని సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. కావున ఉదయం 6 గంటల నుంచి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తామని రైతులు గమనించాలని కోరారు.

ఈ నీరు తాగేదెలా?



రంగుమారిన నీరు

హాలహర్వి: మండలంలోని బాపురం రిజర్వాయర్ నుంచి రంగుమారిన నీరు సరఫరా అవుతోంది. ఆ నీటిని తాగేందుకు ప్రజలు జంకుతున్నారు. నీటిని వడబోసినా బురదమయంగా, రంగుమారడంతో ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు వర్షాలు కురవడం, మరోవైపు బాపురం రిజర్వాయర్‌లో దిగువకు నీరు చేరడంతో ఇలా బురదనీరు సరఫరా అయ్యి ఉండొచ్చని కొందరు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఫిల్టర్ చేసిన నీటినే సరఫరా చేయాలని కోరుతున్నారు.

వేదావతిలో కొనసాగుతున్న వరద ఉధృతి



మార్లమడికి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వేదావతి నది

హొళగుంద: ఆంధ్రా–కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులోని మార్లమడికి వద్ద వేదావతి(హగరి) నదిలో వరద ఉధృతి శుక్రవారం కూడా కొనసాగింది. నది ఎగువ భాగంలోని రాయదుర్గం, గుంతకల్ తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా నీటి ప్రవాహం పెరిగింది. పంటల సాగుకు అనువుగా మారిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరద ప్రవాహం పెరగడంతో రైతులు నదిలో ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటర్లు, పైపులను తొలగించారు. అనంతపురం జిల్లా రాయదుర్గంలోని భైరవాని దీప ప్రాజెక్ట్ నించి దిగువకు నీరు వదిలితే నది ఉగ్రరూపం దాల్చుతుందని ఇరు రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోతాయని మార్లమడికి గ్రామస్తులు తెలిపారు. కాగా నదిపై నిర్మించిన వంతెన ఎత్తు లేకపోవడం వల్ల తరుచూ రాకపోకలు నిలిచి ఇబ్బందులు పడుతున్నామని.. కొత్త వంతెన నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

దెబ్బతిన్న హెబ్బటం పెద్దవంక చెరువు గట్టు



చెరువును పరిశీలిస్తున్న అధికారులు



దెబ్బతిన్న గట్టును చూపిస్తున్న రైతు

హొళగుంద: హెబ్బటం గ్రామం వద్ద ఉన్న పెద్దవంక చెరువు గట్టు దెబ్బతినడంతో మైనర్ ఇరిగేషన్ డీఈఈలు చెన్నకేశవనాయక్, షఫీ, ఏఈ ఫణికుమార్ శుక్రవారం పరిశీలించారు. గట్టుకు సంబంధించి పలు చోట్ల బొంగులు(గుంతలు) పడడం వల్ల చెరువు పూర్తిగా నిండితే గట్టు దెబ్బతిని గండి పడే అవకాశం ఉన్నట్లు హెబ్బటం రైతులు తెలిపారు. మరమ్మతు పనులు చేయాలని కోరారు.

చినుకు పడితే చిత్తడే

హాలహర్వి: మండలంలోని గూళ్యం, నిట్రవట్టి గ్రామాల్లో వర్షం వస్తే రహదారులు చిత్తడిగా మారుతున్నాయి. కొన్ని కాలనీల్లో సీసీ రోడ్లు లేకపోవడంతో మట్టి రహదారులు బురదమయంగా మారుతున్నాయి. అడుగు వేసి అడుగు తీయాలంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వృద్ధులు, చిన్నారులు చిత్తడిగా మారిన రహదారిలో నడుచుకుంటూ వెళ్లి కింద పడిన ఘటనలు కూడా ఉన్నాయి. కాలనీలో సీసీ రోడ్లు వేసి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



నిట్రవట్టిలో చిత్తడిగా మారిన మట్టి రోడ్డు

రేపు వాల్మీకి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



మాట్లాడుతున్న వాల్మీకి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయకుడు నాగరాజ్

ఆలూరు: వాల్మీకి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన వాల్మీకి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు ఎస్టీయూ నాయకులు నాగరాజ్, గిరయ్య తెలిపారు. ఆదోనిలోని మంగళ ఆంజేయస్వామి ఆలయం ఆవరణలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లాలో పదిలో ఉత్తమ మార్కులు వచ్చిన విద్యార్థులు మార్కుల జాబితాతో హాజరుకావాలని కోరారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ఆలూరు: నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని.. పార్టీ నాయకులకు అండగా ఉంటానని టీడీపీ నేత వీరభద్రగౌడు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు.